సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 16 । ఆగస్టు । 2025

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను నేడు (శనివారం) మాకు పంపించండి. ఆదివారం సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయస్సు 10 సంవత్సరాలలోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం తప్పని సరిగా పేర్కొనాలి.



ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : 89789 63674



నిందలు వేయడం సిగ్గుచేటు

కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నిందలు వేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

ఏఎన్ఎం, అకౌంటెంట్ ఉద్యోగాలకు దరఖాస్తులు

భువనగిరి : జిల్లాలోని కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం సంబంధిత కోర్సులో శిక్షణ పూర్తి చేయడంతో పాటు ఇంటర్ విద్యార్హత, అకౌంటెంట్ పోస్టుకు బీకాం, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండలన్నారు. దరఖాస్తులను ఈ నెల 22లోపు అందజేయాలన్నారు. వివరాలకు 9441189894ను సంప్రదించాలని కోరారు.

అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లో..

చందేపల్లి పరిధిలోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అటెండర్, డే, నైట్ వాచ్‌మన్లు, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 22వ తేదీ లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9441189894 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

భువనగిరి: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వేముల నరేష్, జైనపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, గూడూరు నరోత్తంరెడ్డి, పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కొప్పుల యాదిరెడ్డి, చందా మహేందర్ గుప్తా, కాదూరి అచ్చయ్య, కార్యదర్శులుగా వైజయంతి, కృష్ణ, మల్లారెడ్డి, మేడి కోటేష్, లక్ష్మీనారాయణ, కోశాధికారులుగా సోమ నరసయ్య, జిల్లా కార్యాలయ కార్యదర్శిగా మంగు నర్సింగ్‌రావు, జిల్లా ఐటీ ఇన్‌చార్జి వెంకటేష్, మీడియా ఇన్‌చార్జి రామకృష్ణ,సోషల్ మీడియా కో కన్వీనర్‌గా సుధ, ఉదయ్‌కిరణ్ నియమితులయ్యారు. నూతన కార్యవార్గన్ని జిల్లా అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరిటౌన్ : ప్రజా సమస్యలపై వారం రోజుల పాటు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. శుక్రవారం భువనగిరిలోని సీపీఎం కార్యాలయంలో కల్లూరి మల్లేశం అధ్యక్షతన జరిగిన సెక్రటేరియట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచడం లేదన్నారు. మూసీ పునరుజ్జీవం, బస్వాపురం గంధమల్ల, దేవాదుల ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈనెల 22 23 24 25 తేదీల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట నిరసనలు, 28 29 30 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరు బాలరాజు, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య, బూరుగు కష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

పల్లెకవిత-విద్యాభవిత పుస్తకావిష్కరణ

ఆలేరు: పట్టణంలోని సిల్క్‌నగర్‌కు చెందిన కవి ఎస్‌కే జానిమియా రచించిన 'పల్లె కవిత-విద్యా భవిత' పుస్తకాన్ని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో టీసీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం హాజరుశాతం ఎక్కువ ఉన్న విద్యార్థులు, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ కేడెట్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, సైదులు,మల్లేష్, మేఘరాజు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపేందర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

అహర్నిశలు శ్రమిద్దాం.. అగ్రగామిగా నిలుపుదాం



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు



"సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు నీరు అందించడమే లక్ష్యం. గంధమల్ల రిజర్వాయర్ భూ సేకరణ దాదాపు పూర్తయ్యింది. మూసీ కాలువల ఆధునీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

-గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్

- అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- స్వాతంత్య్ర వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: 'ప్రజాప్రభుత్వంలో అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.. సమన్వయంతో సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుదాం. అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం' అని శాసనమండలి గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రగతి కార్యక్రమాలను వివరించారు.

ప్రసంగంలోని ప్రధానాంశాలు

- జిల్లాకు 9,398 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 7,542 ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. నిర్మాణ దశను బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.47 కోట్లు జమ చేశాం.
- కొత్తగా 23,367 రేషన్‌కార్డులు మంజూరు చేశాం. వీటి ద్వారా 71,530 మందికి లబ్ధి చేకూరుతుంది.
- రుణమాఫీ పథకం కింద 2,33,418 మంది రైతులకు రూ.306.47 కోట్లు మాఫీ జరిగింది. 2024-25 యాసంగి సీజన్‌లో 375 కొనుగోలు కేంద్రాల ద్వారా 43,128 మంది రైతుల నుంచి 3,74, 728 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.865 కోట్లు చెల్లించాం.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

- 23,921 ఎకరాల్లో ఉద్యాన, మల్బరీ తోటలు సాగవుతున్నాయి. గత మూడేళ్లలో 4,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు సాగైంది. ఈ ఏడాది 3,500 ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించాం.
- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో 1,200 సమస్యలను పరిష్కరించాలి.
- ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను మంజూరు చేసింది.
- జాతీయ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా 1,084 మందికి రూ.2.16 కోట్ల ఆర్థిక సాయం అందించాం
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలకు రూ.611.17 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించాం. ఇప్పటి వరకు రూ.189.52 కోట్లు మంజూరు చేశాం.
- 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాలకు గాను 'నేతన్నకు పొదుపు' పథకాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేస్తున్నాం. ఈ పథకంలో 10,790 మంది చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు నమోదు కాగా రూ. 2.17 కోట్లు విడుదల చేశాం.
- తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన ఇద్దరు, వైకల్యం పొందిన నలుగురు గీత కార్మికులకు రూ.10.40 లక్షల ఎక్స్ గ్రేషియా అందజేశాం.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతారం జెడ్పీహెచ్ఎస్, భువనగిరిలోని కృష్ణవేణి హైస్కూల్, బాలికల హైస్కూల్, విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అదే విధంగా ఉత్తమ సేవలందించి 162 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. 2,379 స్వయం సహాయక సంఘాలకు రూ.210 కోట్ల బ్యాంకు రుణాలకు సంబంధించి చెక్కులు అందజేశారు.

స్టాళ్ల ప్రదర్శన

ఉద్యానవన, రోడ్లు భవనాలు, మహిళాశిశు సంక్షేమం , ఎస్సీ, మైనార్టీ సంక్షేమం, నీటిపారుదల, సహకార, మత్స్యశాఖ, పశుసంవర్ధక, వైద్యారోగ్య, గ్రామీణాభివృద్ధి, మెప్మా, విద్య తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు, శకటాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. అంతకుముందు కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి శాసన మండలి చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఏఎస్పీ రాహుల్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు .

గంధమల్లకు రూ.358 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తుంది. అందులో భాగంగా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించింది. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న గంధమల్ల రిజర్వాయర్ పనులను సీఎం రేవంత్ రెడ్డి, శంకుస్థాపన చేశారు. 1.41 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించనున్నారు.ఇందుకోసం ప్రభుత్వం రూ.358.16 కోట్ల మంజూరు చేసింది. ఆలేరు నియోజకవర్గంలో 56 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. దీంతో పాటు బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశాం. పనులు పురోగతిలో ఉన్నాయి.

రాచకొండ పోలీస్ ఆదర్శం

నేరాల నియంత్రణ, కేసుల చేదనలో రాచకొండ పోలీసులు తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచారు. నేరాల నియంత్రణలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో విరివిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సాంఘిక దురాచారాలపై కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

టెన్త్ ఫలితాల్లో మెరుగైన స్థానం

గత విద్యా సంవత్సరం మార్చిలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 159 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 97.8 ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో జిల్లా 7వ స్థానంలో నిలిచింది. ఈ విద్యా సంవత్సరం 5,800 మంది పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం గొప్ప విషయం.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కనులపండువగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, సహస్ర నామార్చనతో కొలిచారు. ఇక ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక, వెండి జోడు సేవోత్సవం నిర్వహించారు.

సమన్వయంతోనే ప్రగతిపథం : కలెక్టర్



కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, అధికారులు, ఉద్యోగులు



యాదగిరి కొండపైన జాతీయ జెండా ఎగురవేస్తున్న ఆలయ ఈఓ వెంకట్రావ్

సాక్షి యాదాద్రి : కలెక్టరేట్‌లో శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పథకాల అమలులో అధికారులు, ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వాలు ఏ స్ఫూర్తితో పథకాలు తెస్తున్నాయో, అదే స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో అమలుచేసి, ప్రభుత్వ ఫలాలను అర్హులకు అందేలా కృషి చేయాలని కోరారు. సమన్వయంతో జిల్లాను ప్రగతిపథంలో తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో నెరవేర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో..

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈఓ వెంకట్రావ్ జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ, దేవస్థానం అధికారులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

అడిగితే.. అదిగో ఇదిగో!

బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులందరికీ అందని పరిహారం

- 350 మందికి రూ.79 కోట్లు పెండింగ్
- అందరికీ చెల్లిస్తేనే గ్రామాన్ని ఖాళీ చేయించడానికి అవకాశం
- నృసింహసాగర్ రిజర్వాయర్‌లోకి నీటి విడుదలకు మరికొంత సమయం



భువనగిరి మండలం బస్వాపురం వద్ద నిర్మించిన నృసింహసాగర్ రిజర్వాయర్

సాక్షి, యాదాద్రి: నృసింహసాగర్ రిజర్వాయర్ పనులు మొదలై ఏడేళ్లు పూర్తి కావస్తోంది. కానీ, ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన రైతులు మాత్రం పరిహారం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. అధికారులను అడిగితే అదిగో,ఇదిగో అంటున్నారే తప్ప.. స్పష్టత ఇవ్వడంలేదని నిర్వాసితులు వాపోతున్నారు. రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలంటే బీఎన్ తిమ్మాపురం గ్రామాన్ని ఖాళీ చేయించాలి. నిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తే తప్ప ఊరిని ఖాళీ చేయించే పరిస్థితి లేదు.

రూ.79 కోట్లు పెండింగ్..

కాళేశ్వరం ప్రాజెక్టు 16వ ప్యాకేజీలో భువనగిరి మండలం బస్వాపురం వద్ద నృసింహసాగర్ సాగర్ రిజర్వాయర్ నిర్మిస్తున్నారు.11.39 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులకు గ్రామకంఠం కింద రూ.109 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉంది. అందులో పది నెలల క్రితం కేవలం రూ.30 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.79 కోట్లు పెండింగ్‌లో ఉంది. గ్రామంలో 550 మంది వరకు నిర్వాసితులు ఉండగా 200 మందికి పరిహారం వచ్చింది. మరో 350 మందికి పెండింగ్ ఉంది. నిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తే ప్రస్తుతం 1.5 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేయవచ్చు. కానీ, పరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యం వల్ల రిజర్వాయర్‌లోకి నీటి విడుదలపై స్పష్టత ఉండటం లేదు.

నిధుల కోసం మంత్రిని కలిశాం

బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితుల్లో కొందరికి పరిహారం పెండింగ్ ఉంది. ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి పెండింగ్ పరిహారం విడుదల చేయాలని కోరడం జరిగింది. మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే చెల్లిస్తాం. ఆ తరువాత రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపుతాం.

-అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

పరిహారం చెల్లిస్తేనే ఖాళీ చేస్తాం

బస్వాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన తమకు ఏళ్లు గడిచినా పరిహారం అందలేదు. ప్రాజెక్టులోకి నీరు విడుదల చేస్తామని అధికారులు అంటున్నారు. మేము ఎక్కడికి పోవాలి. పరిహారం చెల్లిస్తే పునరావాస గ్రామంలో ఇల్లు నిర్మించుకుని వెళ్లిపోతాం. పరిహారం ఇచ్చి ఖాళీ చేయించాలి.

-నందు, బీఎన్ తిమ్మాపూర్

కొందరికే ఇచ్చారు

బీఎన్‌తిమ్మాపురంలో నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించలేదు. 200 మంది వరకు ఇచ్చారు. ఇంకా 350 మందికి పెండింగ్ ఉంది. అందరికీ పరి హారం డబ్బులు ఇస్తే పునరావాస గ్రామంలో ఇళ్ల నిర్మించుకుంటారు. పనులు మొదలై ఏళ్లు గడుస్తుంది. డబ్బుల కోసం గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

-ఎడ్ల సత్తిరెడ్డి, బీఎన్ తిమ్మాపురం

ఎర్రకోట వేడుకల్లో పాటిమట్ల రైతు దంపతులు

మోత్కూరు: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన రైతు తేలుకుంట్ల రామ్మూర్తి దంపతులు పాల్గొన్నారు. రామ్మూర్తి పది ఎకరాల్లో కలబంద సాగు చేస్తూ వివిధ కంపెనీలకు సరఫరా చేస్తున్నాడు. ఔషధ రంగంలో ఉపయోగించే కలబందను ఆధునిక పద్ధతుల్లో ఐదేళ్లుగా సాగు చేస్తూ గుర్తింపు పొందాడు. కేంద్ర ఆయుష్ విభాగం ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు రైతు రామ్మూర్తి దంపతులు హాజరయ్యారు.



ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న పాటిమట్లకు చెందిన రైతు రామ్మూర్తి దంపతులు

గుట్టలో వరలక్ష్మీ వ్రతాలు



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. యాదగిరి కొండ దిగువన సత్యనారాయణస్వామి వ్రత మండపంలో దేవస్థానం నిర్వాహకులు భక్తులకు పూజా సామగ్రి, అమ్మవారి ఫొటోలు ఉచితంగా అందజేశారు. వరలక్ష్మీ విశిష్టతను అర్చకులు వివరించారు. సుమారు 200 మంది మహిళలు వ్రతాలు ఆచరించి సౌభాగ్య లక్ష్మీ ఆశీస్సులు పొందారు.


నల్లగొండలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి


సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు


సూర్యాపేటలో ఎగ్జిబిషన్ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


గౌతమ్ మోడల్ స్కూల్ జైజవాన్ నృత్య ప్రదర్శన


నల్లగొండలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


భువనగిరిలో సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శకటం ప్రదర్శన


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు


భువనగిరిలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఉత్తమ సేవలకు గుర్తింపు


భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


శేఖర్‌రెడ్డి, ఆర్డీఓ, చౌటుప్పల్ | నాగిరెడ్డి, డీఆర్‌డీఓ | మధుసూదన్‌రావు, జిల్లా ఫైర్ అధికారి | విష్ణుమూర్తి, జిల్లా ఎక్సైజ్ అధికారి | సుధీర్‌కుమార్, ఎస్ఈ టీజీఎస్పీడీసీఎల్ | శోభారాణి, సీఈఓ


డాక్టర్ మనోహర్, డీఎంహెచ్ఓ | రోజా, డీసీఎస్‌వో | జినుకల శ్యాంసుందర్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ | శ్రీ రామకృష్ణ, ఎల్‌డీఎం | ఎడవల్లి అరుంధతి, డీపీఆర్‌ఓ | పరాంకుశం సాహితి, ఉపాధి కల్పనాధికారి | మధుసూదన్, ఏడీ ఎస్అండ్‌ఎల్‌ఆర్ | సునంద, డీపీఓ | సీహెచ్ రమణి, డీఐఈఓ | విజయ్‌సింగ్, హౌసింగ్ పీడీ | హరికృష్ణ, డీఎం సివిల్‌సప్లై | సాయికృష్ణ, డీటీఓ


జగన్‌మోహన్‌ప్రసాద్, ఏఓ కలెక్టరేట్ | రవికుమార్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ | అశోక్ రెడ్డి, తహసీల్దార్, భువనగిరి | వంశీ, సీసీ టు కలెక్టరేట్ | రామారావు, సూపరింటెండెంట్ | సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ | జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి, సూపరింటెండెంట్ | ఎండీ రఫీయోద్దీన్, సీసీ టు అడిషనల్ కలెక్టర్ | శ్రీకాంత్, సీసీ టు రెవెన్యూ అదనపు కలెక్టర్ | జానయ్య , జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి | కంది హనుమాన్ ప్రసాద్, ఇన్‌చార్జ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్, చౌటుప్పల్

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

తిప్పర్తి: అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తిప్పర్తి మండలంలోని తిప్పర్తి– రాయినిగూడం రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బండారు మహేష్ (37) ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. అప్పులు ఎక్కువ కావడం, వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ రైల్వేస్టేషన్ మాస్టర్ అభినవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు



నేరేడుచర్ల : కారు అదుపు తప్పి సాగర్ ఎడమ కాలువలో పడింది. పెన్‌పహాడ్ మండలం అన్నారం గ్రామానికి చెందిన నారాయణ నరేష్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సూర్యాపేటలో నూతన ఇంటి నిర్మాణం కోసం సామగ్రిని కారులో తీసుకువచ్చాడు. ఇంటి వద్ద సామగ్రిని పెట్టి తన అత్తగారి ఊరైన ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు బయలుదేరాడు. సూర్యాపేట మీదుగా మిర్యాలగూడకు వెళ్లేందుకు నేరేడుచర్ల మండలం కల్లూరు అడ్డ రోడ్డు వద్దకు వచ్చాడు. మిర్యాగూడ రోడ్డు వైపు వెళ్లకుండా పొరపాటున సాగర్ ఎడమ కాలువ వైపు తిప్పాడు. దీంతో కారు అదుపు తప్పి కాలువలో పడిపోయింది. నరేష్‌రెడ్డి కారు నుంచి దూకడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల సహకారంతో కారు బయటకు తీశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

భువనగిరిటౌన్ : ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం భువనగిరి పట్టణ కేంద్రంలోని బహార్‌పేటలో చోటుచేసుకుంది. భువనగిరిలో గురువారం జరిగిన బోనాల పండగలో శుభాకాంక్షలు తెలిపేందుకు ఫ్లెక్సీలను కడుతుండగా కమ్మ ఉదయ్ కిరణ్ (24) విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి తండ్రి కమ్మ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ప్రభాకర్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరటికల్ గ్రామానికి చెందిన కట్టెకోల ప్రభాకర్(55), చిన్నం నర్సయ్యతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై ఆత్మకూరు(ఎం) నుంచి కొరటికల్‌కు వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సుంచు మహేష్ అతని భార్యతో కలిసి కొరటికల్ నుంచి ఆత్మకూరు(ఎం)కు బైక్‌పై వస్తున్నాడు. కేజీబీవీ పాఠశాల సమీపంలో టీవీఎస్ ఎక్సెల్, బైక్ ఢీకొన్నాయి. దీంతో ప్రభాకర్‌తో పాటు సుంచు మహేష్‌కు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్‌ను భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ హనుమంతు తెలిపారు.

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకల్లో కోదాడ విద్యార్థులు


ఢిల్లీలో జరిగిన వేడుకల్లో కోదాడలోని తేజ విద్యాలయం విద్యార్థులు

కోదాడరూరల్ : ఢిల్లీలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయానికి చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా భారత రక్షణశాఖ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో 2లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 200మంది విద్యార్థులకు ఢిల్లీలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు హాజరయ్యేందుకు అవకాశం దక్కింది. వారిలో కోదాడ తేజ విద్యాలయం విద్యార్థులు 15 మంది ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.

గోల్కొండ కోటలో మోగిన సతీష్ డప్పు దరువు

గరిడేపల్లి: గోల్కొండ కోటలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ డప్పు కళా బృందం, మహిళా డప్పు కళాకారులు పాల్గొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్ మామిడి హరికృష్ణ సహకారం, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ సౌజన్యంతో గోల్కొండ కోటలో డప్పుల దరువు ప్రదర్శనలో పాల్గొన్నట్లు మాస్టర్ అమరవరపు సతీష్ తెలిపారు. వేడుకల్లో కల్పన, స్వరూప, భువన, అపర్ణ, నాగమణి, వీరబాబు, శోభన్, గంగ, వెంకటమ్మ, కుమారి, సంజయ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


గోల్కొండ కోటలో డప్పుల దరువు ప్రదర్శించిన కళాకారులు

గంజాయి నిందితుల అరెస్టు

- 1.650 కేజీల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

హాలియా : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం హాలియా పోలీస్ స్టేషనల్‌లో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం సిరిగిరిపాడు గ్రామానికి చెందిన వజ్రాల రాజశేఖర్, నల్లగొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంటతండాకు చెందిన కుందాల వేణు, తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన గురజాల మహేందర్ గంజాయికి అలవాటు పడి ముఠాగా ఏర్పడ్డారు. ఆంధ్రాకు చెందిన గడిగంటి అచ్చయ్య, తిరుమలకొండ యేసుబాబు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అనుముల మండలంలోని పంగవానికుంటతండా శివారులోని అల్వాల ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. హాలియా పోలీసులు అల్వాల ఎక్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేయగా 1.650 కేజీల గంజాయి లభ్యమైంది. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోగా, వారిని అరెస్టు చేశారు. గంజాయి సరఫరాకు సంబంధించిన గడిగంటి అచ్చయ్య, తిరుమలకొండ యేసుబాబు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద 1.650 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్‌లను డీఎస్పీ అభినందించారు.

త్రివర్ణ పతాక అలంకరణలో సాయినాథుడు


త్రివర్ణ పతాక అలంకరణలో దర్శనమిస్తున్న సాయినాథుడు

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో శుక్రవారం లక్ష గాజుల పూజ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి సామూహిక కుంకుమార్చనలు లక్ష గాజుల పూజా కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు వేరే సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక రాజేశ్వరి పీఠాధిపతి మేలురి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే త్రివర్ణ పతాకంతో సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచిగంటి ధనంజయ, ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనం సిబ్బందికి ప్రశంసా పత్రాలు


బుద్ధవనంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్ : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బుద్ధవనం సిబ్బందికి ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు బుద్ధవనంలోని మహాస్తూపం వద్ద జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. 20ఏళ్లుగా బుద్ధవనంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించే విధంగా ప్రశంసా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, మేనేజర్ రవిచంద్ర, బుద్ధవనం ఆర్ట్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ నాజీష్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితులకు రిమాండ్

పాలకవీడు: మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన బట్టు కళాశ్రీ (20) ఈ నెల 9న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. అదనపు కట్నం కోసం కళాశ్రీ అత్త ఉమాదేవి, మామ హనుమంతరావు, ఆడపడుచు ప్రియదర్శిని, భర్త పవన్ కళ్యాణ్ కళాశ్రీని తరచూ వేధించేవారు. భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో భరించలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై కోటేష్ తెలిపారు. నలుగురు నిందితులను శుక్రవారం హుజూర్‌నగర్ కోర్టు ఎదుట హాజరుపరచగా నల్లగొండ సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు.